సాక్షి
విజయనగరం

సోమవారం । 12 । జూన్ । 2023



విజయ దుందుభి

విజయనగరం వేదికగా జరిగిన ఏపీఎల్ ఉమెన్స్ టీ–20 క్రికెట్ లీగ్ పోటీల విజేతగా విజయనగరం రాయల్స్ జట్టు నిలిచింది.

- 8లో



కొండంత అక్రమం..!

దత్తిరాజేరు మండలంలోని కోరపు కొత్తవలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్–1లో జరిగిన భూఆక్రమణ బయట పడింది.

- 8లో



ఐదు పూరిళ్లు దగ్ధం

మెంటాడ మండలంలోని కొండలింగాలవలస గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు పూరిళ్లు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారి రవి తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

108 సర్వీసెస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా వేమలి



108 ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: 108 సర్వీసెస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా వేమలి అప్పలనాయుడు ఎన్నికయ్యారు. స్థానిక కె.ఎల్.పురంలోని శ్రామిక్ భవన్‌లో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎనుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బోను వెంకటరమణ, కోశాధికారిగా పెంట రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొల్లి గోపాలం, స్టేట్ ఆఫీస్ బేరర్లుగా అల్లాడ సూర్యనారాయణ, మిడతాన విజయ భాస్కర్ ఉపాధ్యక్షుడిగా అర్జిరాజులు ఎన్నికయ్యారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

విజయనగరం పూల్‌బాగ్: మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించి పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. పరీక్షకు 2831 మందికిగాను 2435 మంది హాజరైనట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. 396 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. డీఈఓ, ఆర్‌జేడీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు డీఈఈ సెట్

విజయనగరం పూల్‌బాగ్: డీసెట్ – 2023 పరీక్ష స్థానిక గాజులరేగలో సీతం కాలేజీలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30వరకు జరుగుతుందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగా హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని పరీక్ష కేంద్రానికి రిపోర్ట్ చేయాలన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో వివిధ శాఖల్లో కాంట్రాక్ట్ పద్ధతిని పని చేస్తున్న ఉద్యోగులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం పేర్కొంది. ఈ మేరకు స్థానిక సంఘం భవనంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పలువురు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. తొలిత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 'థాంక్యూ సీఎం సార్' పేరుతో జేజేలు పలికారు. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న 10 వేల మంది ఆశలు నెరవేర్చారని కొనియాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సీఎం చొరవ తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అందుకు సహకరించిన మంత్రి మండలిలోని మంత్రులతో పాటు జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అత్యధిక సంఘాలు జేఏసీ కలిగి ఉన్న ఎన్జీఓ సంఘం ఎల్లప్పుడూ ఉద్యోగుల సంక్షేమం, ప్రయోజనాలు కాపాడేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ముప్వల గంగా ప్రసాద్‌రావు, కార్యదర్శి చందక శ్రీనివాసరావు, కోశాధికారి పి.రామలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు మరడాన మంగరాజు, కార్యదర్శి గంగి రమేష్, కోశాధికారి జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్ సిబ్బందికి రిక్వెస్ట్ బదిలీలు

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్(ఆర్ట్, వర్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్) సిబ్బందికి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయనున్న అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 17 వరకు మాత్రమే స్వయంగా జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. బదిలీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఈ నెల 23 ఉదయం 10.30 నుండి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. తదుపరి మార్పులు ఉన్నట్లయితే పత్రికా సమాచారం ద్వారా తెలియజేస్తామన్నారు.

నేడు 'తోటపల్లి' నీరు విడుదల

పార్వతీపురం: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా సోమవారం సాగునీటిని విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి సాగునీటిని ముందుగానే విడుదల చేసి తొలిత కాలువ పరిధిలోని చెరువులలో నీటిని నిల్వ చేసేలా రైతులను అవగాహన కల్పిస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాలువ ద్వారా తొలిత 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి క్రమేపి పెంచుతూ 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నారు. ఈ ఏడాది 85 వేల ఎకరాలకు సాగునీటిని సరఫరా చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు.

నేనున్నానంటూ...



అన్ని వర్గాల ప్రజలకు తానున్నానంటూ అధికారం చేపట్టాక అండగా ఉంటున్న జగనన్న హెచ్ఐవీ బారిన పడిన బాధితులకు కూడా నేనున్నానంటూ ధైర్యం ఇస్తున్నారు. హెచ్ఐవీ రోగులకు పింఛన్లు మంజూరు చేసి వారి జీవితానికి అండగా నిలుస్తున్నారు. వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నారు.

- హెచ్ఐవీ బాధితులకు అండగా ప్రభుత్వం
- ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెర
- కొత్తగా 1295 మందికి పింఛన్ల మంజూరు

విజయనగరం ఫోర్ట్:

రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం పేరిట అండగా నిలుస్తూ పలు పథకాల ద్వారా వారిని ఆర్థికంగా ఎదిగేందుకు తన వంతు చేయూతనిస్తోంది. అందులో భాగంగా హెచ్ఐవీ బాధితులకు కూడా నేనున్నానంటూ జగనన్న ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తూ వారి జీవనానికి భరోసా కల్పిస్తోంది. వారి జీవితాల్లో సంతోషాలను నింపుతోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వీరిని పెద్దగా పట్టించుకోలేదు. జగనన్న సర్కారు అధికారంలోకి వచ్చాక భరోసా కల్పించింది. హెచ్ఐవీ బారిన పడిన వారు తీవ్రమైన అనారోగ్యంతో ఉంటారు. రోగ నిరోధక శక్తి తగ్గి తరచూ అనారోగ్యం బారిన పడుతుంటారు. పోషక విలువలతో కూడిన ఆహారంతో పాటు ఏఆర్‌టీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే మందుల వాడకం ద్వారా వారి జీవన కాలాన్ని చాలా వరకు పెంచుకునే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితులు బాగున్న వారు పరవాలేదు.. కానీ ఆర్థికంగా వెనుకబడి హెచ్ఐవీ బారిన పడితే పౌష్టికాహారం తీసుకునే పరిస్థితులు ఉండవు. అటువంటి వారికి ప్రభుత్వం అందజేస్తున్న పింఛనే ఆధారం.



హెచ్ఐవీ బాధితులు చికిత్స పొందే సేఫ్ కేర్ సెంటర్

నేరుగా ఖాతాల్లోనే డబ్బులు జమ

ప్రభుత్వం ఇటీవల కొత్తగా 1295 మంది హెచ్ఐవీ రోగులకు పింఛన్లు మంజూరు చేసింది. వారి ఖాతాల్లోనే నేరుగా డబ్బులు జమవుతున్నాయి. ఏఆర్‌టీ కేంద్రంలో క్రమం తప్పకుండా మందులు వాడుతున్న వారు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– డాక్టర్ ఎస్.సూర్యనారాయణ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి

ఏళ్ల తరబడి ఎదురుచూపులు

హెచ్ఐవీ బాధితులు ఫింఛన్ల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. ఫింఛన్ల కోసం గత ఎనిమిది తొమ్మిదేళ్ల కిందట దరఖాస్తు చేసుకున్నారు. వారికి ఫింఛన్లు మంజూరు కాలేదు. ఏఆర్‌టీ సెంటర్‌కు మందుల కోసం వచ్చినప్పడల్లా ఫింఛను మంజూరైందా.. అని అక్కడ సిబ్బందిని ఆశగా అడిగేవారు. ఎట్టకేలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హెచ్ఐవీ బాధితులకు ఇటీవల ఫింఛన్లు మంజూరు చేసింది. గతంలో 848 మందికి మాత్రమే పింఛన్లు వచ్చేవి. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఒక్కసారిగా 1295 మందికి కొత్తగా ఫింఛన్లు మంజూరు చేసింది. దీంతో వారి వెలుగులు నింపింది. ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు పొందుతున్న వీరికి జగనన్న ప్రభుత్వం అందించే పింఛన్ పౌష్టికాహారం అందించడంలో దోహదపడుతుంది. తద్వారా వీరి జీవన ప్రమాణాలు చాలా వరకు మెరుగుపడతాయి. జీవిత కాలం కూడా పెరుగుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

జిల్లాలో 13,261 మంది హెచ్ఐవీ బాధితులు

ఏఆర్‌టీ కేంద్రంలో 13,261 మంది హెచ్ఐవీ రోగులు రిజిస్టర్ అయ్యారు. వీరిలో ప్రస్తుతం ఏఆర్‌టీ మందులు వాడుతున్న వారు 6,340 మంది. వీరిలో పురుషులు 2,591 మంది కాగా మహిళలు 3,457 మంది ఉన్నారు. అదే విధంగా పిల్లలు 283 మంది, ట్రాన్స్‌జెండర్స్ ఎనిమిది మంది ఉన్నారు.

నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం



జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న నెల్లిమర్ల మండలాధికారులు(ఫైల్)

- ఎండల దృష్ట్యా 17 వరకు ఒంటిపూట బడులు
- నేడే జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ
- జిల్లాలో 1,45,883 మందికి ప్రయోజనం

విజయనగరం పూల్‌బాగ్: వేసవి సెలవుల అనంతరం సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే ఆయా పాఠశాలలకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యా సామగ్రి చేరిపోయింది. వేసవి ఎండల దృష్ట్యా ఈ నెల 17వరకు ఒంటి పూట బడులు నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద 1800 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు 1,45,883 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో బాలురు 70,430, బాలికలు 75,453 మంది ఉన్నారు. వీరికి జగనన్న విద్యాకానుక పేరుతో 8 రకాల అభ్యసన సామగ్రి, ఇతర వస్తువులను అందజేయనున్నారు. జేవీకే కిట్‌లో 3జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్స్‌లను బ్యాగులో పెట్టి విద్యార్థులకు అందజేస్తారు.

ఒంటిపూట బడులు

రాష్ట్రంలో వేడిగాలులు దృష్ట్యా జిల్లాలో గల అన్ని యాజమాన్య పాఠశాలలు నేటి నుండి 17 వరకు ఉదయం 7.30 నుంచి 11.30 వరకు పని చేస్తాయి. అన్ని ప్రభుత్వ ఆధీనంలో పని చేస్తున్న పాఠశాలలు ఉదయం 11.30 గంటల నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం భోజనం విద్యార్థులకు అందజేయాలి. ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు రాగిజావ విద్యార్థులకు అందజేసే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి.

నేడు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లాలో క్రోసూరులో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లాలో గల ప్రధానోపాధ్యాయులు అందరూ ప్రతి పాఠశాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించి ఒక పండగ వాతావరణంలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ జరిగేలా డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు చర్యలు చేపట్టాలి.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

జిల్లాలో పంపిణీ పూర్తయిన జగనన్న విద్యాకానుక కిట్ల వివరాలు

వస్తువులు	ఇండెంట్	పంపిణీ చేసినవి	పంపిణీ శాతం
నోట్‌బుక్స్	9,20,766	9,20,766	100 శాతం
బెల్ట్స్	1,00,679	1,00,679	100శాతం
షూస్, సాక్స్‌లు	1,45,460	67,292	46శాతం
పిక్టోరియల్ డిక్షనరీ (1వ తరగతి)	9454	9454	100శాతం
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (6వ తరగతి)	16,960	16,960	100 శాతం
యూనిఫాంలు	1,45,883	1,45,642	99.83శాతం
బ్యాగ్స్	1,45,883	49,218	34శాతం
టెక్స్ట్, వర్క్‌బుక్స్	13,78,801	11,55,483	84శాతం

ఇంజినీరింగ్ విద్యతో వినూత్న ఆవిష్కరణలు



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ తదితరులు

- జేఎన్‌టీయూ జీవీ వీసీ డాక్టర్ కె.వెంకటసుబ్బయ్య

రాజాం సిటీ: ఇంజినీరింగ్ మేధో జీవితానికి నైతిక అధ్యయనమని జేఎన్‌టీయూ జీవీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో ఆదివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథి హాజరైన ఆయన మాట్లాడారు. ఇంజినీరింగ్ అనేది రూపకల్పన, నిర్మాణం, వినూత్న ఆవిష్కరణలు, స్థిరత్వం, అత్యాధునిక సాంకేతిక బాధ్యతలను కలిగి ఉంటుందన్నారు. విజయం సాధించడంతో పాటు సమాజంపై సానుకూల ప్రభావం చూపాలన్నారు. గ్రాడ్యుయేట్లు రోబోటిక్స్, ఇంధన వనరులు, నానో టెక్నాలజీ తదితర రంగాల్లో రాణించి దేశాన్ని స్వావలంబన, ఆత్మనిర్భర్ భారత్‌గా మార్చేందుకు కృషి చేయాలని, తద్వారా భావితరాలకు మార్గదర్శకులు కావాలని అన్నారు. సహకారం, అంకితభావంతో పనిచేసి దేశ సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనాలని ఆకాంక్షించారు. న్యూఢిల్లీకి చెందిన భారత ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ గత తరాలు అభివృద్ధి చేసిన సైన్స్ అండ్ టెక్నాలజీ కోవిడ్ – 19 వంటి మహమ్మారి నుంచి రక్షించిందని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే తరాల విద్యార్థులు సూర్యుని నుంచి ఇంధనం హైడ్రోజన్ ఎలా తీయాలో కనుగొనాలని కోరారు. గ్రాడ్యుయేట్లు సమస్యల పరిష్కారకర్తలుగా మారాలని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవడంలో నైతికతతో బాధ్యతాయుతమైన కొత్తతరం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీ ఆర్ఎస్‌వీ ప్రసాద్, జీఎంఆర్ వీఎఫ్ సీఈఓ అశ్వినిలోహని, ఎల్ఎం లక్ష్మణమూర్తి తదితరులు ప్రసంగించారు.

నేడు ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం

విజయనగరం:

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5.30 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో గల హోటల్ జీఎస్ఆర్‌లో జరిగే సమావేశానికి క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, పీఈటీలు, పీడీలు, క్రీడాకారులు పాల్గొనాలని కోరారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: క్రమశిక్షణ, పట్టుదలతోనే యువత ఉన్నత శిఖరాలకు చేరుకోగలదని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. బ్రహ్మకుమారీస్ యూత్ వింగ్, కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వై 20 కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఆధ్వర్యంలో 'వాక్ ఫర్ పీస్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల వరకు నిర్వహించిన వాక్ ఫర్ పీస్‌ను డీఎస్పీ ఎస్ చక్రవర్తి ప్రారంభించారు. అనంతరం ప్రారంభమైన వాక్ ఫర్ పీస్ కార్యక్రమం ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో బాటు సమాజ పరిశుభ్రతను యువత పాటించాలని ప్రమాణం చేసుకోవాలన్నారు. యువత విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి అనంతం, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, బీజేపీ యువమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెపురి శ్రీను, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, సీఐ జి.సంజీవరావు, ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి బికె.అన్నపూర్ణ, చీపురుపల్లి కేంద్ర ఇన్‌చార్జి బికె.శాంతి, బాలుర ఉన్నత పాఠశాల ఎస్‌సీసీ ఆఫీసర్ మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య...

- తీరిన వసతి సమస్య
- ఎంజేపీఏపీ గురుకులంలో అందుబాటులోకి నూతన డార్మిటరీ
- రూ.94 లక్షలతో నూతన భవనం
- నాడు – నేడు పథకం ద్వారా రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు

నెల్లిమర్ల: ఆ గురుకులంలో ఉన్నత పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల కూడా ఉంది. ఒక్కో తరగతిలో 80 మంది చొప్పున మొత్తం 800 మంది విద్యార్థినులు ఉంటున్నారు. 2017వ సంవత్సరం వరకు పాఠశాల మాత్రమే ఉండటంతో వసతికి ఇబ్బంది ఏర్పడలేదు. అప్పట్లో కళాశాల కూడా ప్రారంభించడంతో సమస్య ప్రారంభమైంది. అందుబాటులో ఉన్న నాలుగు బ్లాకుల్లోనే 800 మంది విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వసతి కోసం అదనపు భవనాలు మంజూరు చేయాలని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎంత మొర పెట్టుకున్నా అప్పటి పెద్దలు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ గురుకులాన్ని నాడు – నేడు పథకానికి ఎంపిక చేసింది. రూ.60 లక్షలతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించింది. అదనపు వసతి కోసం రూ.94 లక్షలు నాబార్డు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో కొత్తగా రెండు బ్లాకుల డార్మిటరీని నిర్మించారు. దీంతో గత ఏడేళ్లుగా నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల నెలకొన్న వసతి సమస్య తీరినట్లయ్యింది. వివరాల్లోకి వెళ్తే...

నెల్లిమర్ల పట్టణంలోని మిమ్స్ వైద్య కళాశాలను ఆనుకుని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల విద్యాలయం ఉంది. 2017 వరకు పాఠశాలగా ఉన్న ఈ విద్యాలయంలో 2017లో జూనియర్ కళాశాల కూడా ప్రారంభించారు. కళాశాలను ప్రారంభించినప్పటికీ అవసరమైన సౌకర్యాలను మాత్రం కల్పించలేదు. దీంతో ఉన్న భవనాల్లోనే తరగతుల నిర్వహణతో పాటు వసతి కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఇక్కడ సుమారు 800 మంది విద్యార్థినులు ఉంటున్నారు. తరగతుల నిర్వహణకు, వసతి కోసం అదనపు భవనాలు నిర్మించాలని అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని మార్లు విన్నవించినా పట్టించుకున్న పాపానపోలేదు. అందుబాటులో ఉన్న నాలుగు బ్లాకుల్లోనే 800 మంది విద్యార్థులు నిద్రపోవాల్సిన దుస్థితి ఉండేది. ఒక్కో సందర్భంలో డార్మిటరీ సరిపోకపోవడంతో తరగతి గదుల్లో నిద్రపోవాల్సిన దుస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యాలయం సమస్యలపై దృష్టి సారించింది. మొదటి విడత నాడు – నేడు పథకానికి ఈ గురుకులాన్ని ఎంపిక చేసింది. పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రూ.60 లక్షలు మంజూరు చేసింది. ఆ నిధులతో తరగతి గదుల రూపురేఖలే మారిపోయాయి. అవసరమైన మరుగుదొడ్లను నిర్మించారు. అంతేగాకుండా వసతి సమస్య తీర్చడానికి అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.94 లక్షల నాబార్డు నిధులు కేటాయించింది. ఆ నిధులతో గురుకులంలో అదనంగా రెండు బ్లాకుల డార్మిటరీని నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయితే ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి రానుంది. నూతన డార్మిటరీ నిర్మాణంతో గురుకులంలో వసతి సమస్య తీరుతుందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి నూతన డార్మిటరీ



గురుకులంలో రూ.94 లక్షలతో ప్రభుత్వం నూతనంగా డార్మిటరీని నిర్మించింది. ఇందులో రెండు బ్లాకులున్నాయి. విద్యార్థినులకు వసతి సమస్య చాలా వరకు తీరుతుంది. పాఠశాల పునఃప్రారంభం నుంచి నూతన డార్మిటరీని అందుబాటులోకి తీసుకొస్తాం. మొదటి విడత నాడు – నేడు ద్వారా విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పించాం.

– డాక్టర్ కేటీటీ రావు, కళాశాల ప్రిన్సిపాల్



ఎంజేపీఏపీ గురుకుల కళాశాల



నూతనంగా నిర్మించిన డార్మిటరీ భవనం

క్లుప్తంగా

ఐదు పూరిళ్లు దగ్ధం



మంటలను అదుపులోకి తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మెంటాడ: మండలంలోని కొండలింగాలవలస గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు పూరిళ్లు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారి రవి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామంలోని డోల సన్యాసిరావు ఇంట్లో దీపం ఒత్తిని ఎలుక ఈడ్చుకు పోవడంతో మంటలు చెలరేగాయని, అవి కాస్తా పెరిగి, పక్కనే ఉన్న డోల తిరుపతమ్మ, డోల కోటేశ్వరరావు, డోల నాగమ్మ, డోల శంకరరావు ఇళ్ల వరకూ వ్యాపించడంతో ఆ పూరిళ్లు పూర్తిగా భస్మీపటలమైనట్లు ఆయన తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందగానే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం సుమారు.రూ.1కోటి50లక్షలు వరకూ ఉన్నట్లు అంచనా వేశామన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న నారాయణమ్మ

పార్వతీపురం: తీవ్రమైన కడుపు నొప్పిని భరించలేక ఓ మహిళ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం బల్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన కొల్లి నారాయణమ్మకు కొన్నేళ్లుగా కడుపునొప్పి తరచూ వస్తుంది. ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఉన్న చీమలమందు ఆదివారం తాగేసి ఇంట్లో పడి ఉంది. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంద్వారా చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

తారస్ లారీలో వ్యక్తి అస్వస్థత

సీతానగరం: మండలంలోని రాష్ట్రరహదారిలో చెన్నై నుంచి రాయగడవైపు లోడ్‌తో వెళ్తున్న తారస్ లారీలో వ్యక్తి అప్పయ్యపేట వద్ద అస్వస్థతకు గురయ్యాడు. ఈ సమాచారం మేరకు సీతానగరం 108 సిబ్బంది సంఘటనా స్థలానికి వెళాలరు. అయితే అప్పటికే అస్వస్థతకు గురైన టీఆర్ నరేంద్రను చికిత్స నిమిత్తం వేరే వాహనంలో లారీ డ్రైవర్ పార్వతీపురంమన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించాడు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

పార్వతీపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం టొంకి గ్రామానికి చెందిన కె.ఆనందరావు గ్రామం నుంచి పెదమరికి గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎంఆర్.నగరం సమీపంలో ఎదురుగా పెదబొండపల్లి వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో వాహన చోదకులు ఆనందరావు, అప్పలనాయుడులకు పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు క్షతగాత్రులను చికిత్స కోసం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జారిపడి యువకుడి మృతి



మృతుడు అనిల్‌కూమార్ (ఫైల్)

భోగాపురం: మండలంలోని దిబ్బల పాలెం సమీపంలో శాండిల్ బీజ్ వద్ద ప్రమాదవశాత్తు హట్‌పై నుంచి కిందకు జారిపడి శనివారం రాత్రి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. భోగాపురం గ్రామానికి చెందిన ముద్దన అనిల్‌కూమార్ తన స్నేహితుడు భార్గవ్‌సాయి శనివారం సాయంత్రం దిబ్బలపాలెం సమీపంలో శాండిల్ బీచ్ వద్దకు వెళ్లారు. అక్కడే ఉన్న హట్‌పైకి ఇద్దరూ వెళ్లి మద్యం సేవించి నిద్రలోకి జారుకున్నారు. రాత్రి 10 గంటల సమయంలో అనిల్‌కూమార్ హట్‌పై నుంచి కిందికి జారిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. కొంతసేపటికి భార్గవ్‌సాయి లేచి అపస్మారక స్థితిలో పడి ఉన్న స్నేహితుడిని లేపాడు. ఎంతసేపటికీ చలనం లేవకపోవడంతో అనిల్‌కుమార్ తమ్ముడు భార్గవ్, స్నేహితులు మరాడ విజయ్, సాయివినోద్, జోగేంద్రసిద్ధులకు సమాచారం అందించాడు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని అనిల్‌కూమార్‌ను ఆటోలో సుందరపేట ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అనిల్‌కూమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తండ్రి చిన్నారావు ఫిర్యాదు మేరకు కేసు నమాదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.



క్రీడాకారులతో ముఖ్య అతిథులు

విజయ దుందుభి

- ముగిసిన ఉమెన్స్ టీ–20 క్రికెట్ లీగ్ టోర్నీ
- విజేతగా నిలిచిన విజయనగరం రాయల్స్ జట్టు
- వరుసగా రెండవ సారి టైటిల్



టాస్ వేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విజయనగరం వేదికగా జరిగిన ఏపీఎల్ ఉమెన్స్ టీ–20 క్రికెట్ లీగ్ పోటీల విజేతగా విజయనగరం రాయల్స్ జట్టు నిలిచింది. 8 రోజులుగా ఉత్కంఠ భరితంగా సాగిన టోర్నీలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన విజయనగరం రాయల్స్–వైజాగ్ డాల్ఫిన్స్ జట్ల మధ్య ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో విజయనగరం రాయల్స్ ఘనవిజయం సాధించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో వరుసగా రెండవసారి టైటిల్ అక్కించుకున్న జట్టుగా విజయనగరం రాయల్స్ నిలిచింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో జరిగిన చివరి మ్యాచ్‌ను ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి టాస్ వేసి ప్రారంభించగా..టాస్ గెలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 133 పరుగులు చేసింది. అనంతరం 134 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన విజయనగరం రాయల్స్ జట్టు 19.2 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 137 పరుగులు స్కోరు సాధించి విజేతగా నిలిచింది. ఆ జట్టు ఓపెనింగ్ బ్యాటర్లు తొలి వికెట్‌కు 5 ఓవర్లలో 30 పరుగుల భాగస్వామం నెలకొల్పడం జట్టు విజయంలో కీలకంగా మారింది. విజేతలకు విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, టోర్నీ బ్రాండ్ అంబాసిడర్ రష్మీగౌతమ్, ఏసీఏ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన విజయనగరం రాయల్స్ జట్టు రూ.6 లక్షలు, రన్నరప్‌గా నిలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టుకు రూ.4 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.

ఉమెన్స్ క్రికెట్ లీగ్ శుభపరిణామం

దేశంలో మొదటి సారి ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమెన్స్ టీ–20 లీగ్ పోటీలు ప్రారంభించడం మంచి పరిణామమని పురుషులతో సమానంగా స్త్రీలను అన్ని రంగాల్లో ప్రోత్సహించే దిశగా ఏసీఏ ఆధ్వర్యంలో క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు అన్నారు. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్‌లో కీలక భూమిక పోషిస్తున్న విజయనగరం క్రికెట్ అసోసియేషన్‌కు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి క్రీడారంగానికి, క్రీడాకారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రాబోయే కాలంలో విజయనగరంలో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించేలా ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ అభివృద్ధి చేస్తోందని ఆకాంక్షించారు. అందుకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం తరఫున అందిస్తామన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన విజయనగరం రాయల్స్ జట్టుతో పాటు ద్వితీయ స్థానంలో నిలిచిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, కోశాధికారి సీతారామరాజు, నార్త్‌జోన్ అకాడమీ చైర్మన్ జీవీ సన్యాసిరాజు, కన్వీనర్ పి.దేవవర్మ, సెట్విజ్ సీఈఓ బి.రామగోపాల్, మాజీ క్రీడాకారిణి ఆర్.కల్పన తదితరులు పాల్గొన్నారు.



రన్ చేస్తున్న వైజాగ్ డాల్ఫిన్ జట్టు క్రీడాకారిణులు



బౌలింగ్ చేస్తున్న విజయనగరం రాయల్స్ క్రీడాకారిణి



విజయనగరం రాయల్స్, వైజాగ్ డాల్ఫిన్ జట్ల మధ్య హోరా హోరీగా జరుగుతున్న ఫైనల్ మ్యాచ్

కొండంత అక్రమం..!



కొండపైన ఆక్రమణ దారులు చుట్టూ వేసిన గట్టు

- గిరిజన యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలం పక్కనే ఆక్రమణ
- రాత్రి సమయంలో గట్లు వేసిన ఆక్రమణ దారులు

దత్తిరాజేరు: మండలంలోని కోరపు కొత్తవలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్–1లో కొండను అక్రమించేందుకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రణాళిక వేయడంతో అది కాస్తా బయట పడింది.గిరిజన యూనివర్సిటీ ప్రతిపాదిత స్థలాన్ని ఆనుకుని కొండ ఉండడంతో పాటు జాతీయ రహదారికి కిలో మీటర్ దూరంలో ఉండడంతో ఇక్కడ భూములు ధరలు అమాంతంగా పెరగ్గా ఆక్రమణ దారుల కన్ను కొండపై పడింది.గతంలో జాతీయ రహదారి విస్తరణ పనులకు కంకరు తవ్వకాలు జరిగిన ప్రదేశం చుట్టూ రాత్రి సమయంలో జేసీబీ, ట్రాక్టర్లతో చక్కగా గట్లు వేశారు. అంతటితో ఆగకుండా కిందనే ఉన్న మరో రెండెకరాల స్థలంలో మొక్కలు వేసేందుకు చదును చేసి సిద్ధం చేయడం స్థానికుల కంటబడడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆక్రమణల బాగోతం బయట పడింది. ఈ విషయమై తహసీల్దార్ రమేష్ వద్ద ప్రస్తావించగా తన దృష్టికి వచ్చిందని వీఆర్వో ద్వారా సమాచారం సేకరిస్తున్నామని ఆక్రమించిన వారు ఎంత వారైనా చర్యలు తీసుకోవడం తప్పదని స్పష్టం చేశారు.



కిందన మొక్కలు వేసేందుకు చదును చేసిన స్థలం

బారసాలకు వచ్చి వెళ్తుండగా..



లారీని ఢీకొని ప్రమాద స్థలంలోనే మృతి చెందిన లక్ష్మణరావు

లావేరు: మండలంలోని బుడుమూరు గ్రామం వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఆల్తీ లక్ష్మణరావు(50) అనే వ్యక్తి మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా రాజాం మండలంలోని గురవాం గ్రామానికి చెందిన ఆల్తీ లక్ష్మణరావు, ఎల్.త్రినాథరావు ఆదివారం ద్విచక్రవాహనంపై లావేరు మండలంలోని రాయిలింగారిపేట గ్రామంలో జరిగిన బారసాల ఫంక్షన్‌కు వచ్చారు. భోజనాలు చేసిన అనంతరం తిరిగి గురవాం వెళ్తుండగా లావేరు మండలంలోని బుడుమూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో లక్ష్మణరావు ద్విచక్రవాహనం పైనుంచి రోడ్డుపై పడి తలకు తీవ్రమైన గాయమైంది. తీవ్ర రక్తస్రావం జరగడంతో ఆయన ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. త్రినాథరావు కూడా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సాయంతో క్షతగాత్రుడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. లావేరు స్టేషన్ ఎస్ఐ కోటేశ్వరరావు ప్రమాద స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కూడా రిమ్స్‌కు తరలించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,550–00
బంగారం(22కి. 10గ్రా.)	55,600–00
వెండి (కిలో)	79,800–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹172	₹314	₹ 324

మన్యం పైనాపిల్‌తో ఆరోగ్యం ఫైన్

- ఈసీజన్‌లోనే పండ్ల లభ్యత
- ఒత్తిడిని దూరం చేసే ఫలం
- వారపు సంతల్లో లభ్యం



సీతంపేట: ఈ సీజన్‌లో అత్యధికంగా ఏజెన్సీలో లభించే పండ్ల జాతుల్లో పైనాపిల్ ఒకటి. సీతంపేట ఏజెన్సీలోనే 8 వేల ఎకరాల్లో ఈ పంట విస్తరించి ఉంది. ఈ సీజన్‌లో లభించే ఈ పండు వినియోగదారులకు ఇక్కడి వారపు సంతల్లో రూ.15 లోపే లభిస్తుంది. మైదాన ప్రాంత వ్యాపారులు ఇక్కడ కొనుగోలు చేసి పట్టణాల్లో రూ.60 వరకు ఒక్కో పండు విక్రయిస్తున్నారు. దీంతో ఈపండుకు డిమాండ్ ఏర్పడింది. పైనాపిల్ తినడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. పైనాపిల్‌లో ఉండే పొటాషియం, సోడియం నిల్వలు ఒత్తిడి, ఆందోళనల నుంచి రక్షణ ఇస్తాయి. వివిధ రకాల వ్యాధులకు పైనాపిల్ దివ్యౌషధమైనే చెప్పుకోవాలి.క్యాన్సర్‌కు కారణమైన ఫ్రీరాడికల్‌తో పోరాడుతుంది.

పైనాపిల్ ఉపయోగాలివే..

- పిల్లల్లో కంటిచూపును మెరుగుపరుస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లను కరిగించడమే కాకుండా పచ్చకామెర్ల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
- పైనాపిల్ రసంలో పంచదార కలిపి సేవిస్తే వేసవిలో అతిదాహం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ రసం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది.
- ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటి సమస్యల్ని దూరం చేస్తాయి.
- పైనాపిల్‌లో 'సి' విటమిన్ పుష్కలంగా లభిస్తుంది. ఇది మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులు, క్యాన్సర్ కారకాలైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది.
- పైనాపిల్‌లోని బ్రోమెలెయిన్ ఎంజైమ్ జీర్ణక్రియ మెరుగుపడడానికి తోడ్పడుతుంది.

చర్మ నిగారింపును పెంచే ఎంజైమ్‌లు పైనాపిల్‌లో ఉన్నాయి.

- పైనాపిల్ తీసుకోవడం వల్ల పొగ తాగడం వల్ల వచ్చే అనర్థాలు తగ్గిపోతాయి.
- పైనాపిల్ రసాన్ని తాగితే వాంతులు తగ్గుతాయి.
- పచ్చకామెర్లతో బాధపడుతున్న వారికి ఈ రసం ఎంతో మేలు చేస్తుంది.
- పైనాపిల్‌లో ఉన్న ఫైబర్ మలబద్ధకం తగ్గించడానికి సహాయపడుతుంది.
- జుట్టు రాలడాన్ని తగ్గించడంలో ఈ ఫలం ఉపకరిస్తుంది.

ఇమ్యూనిటీ పెంచుతుంది

పైనాపిల్‌లో మినరల్స్ అధికంగా ఉంటాయి కాబట్టి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఒక కప్పు తాజా పైనాపిల్ రసంలో 131 శాతం విటమిన్–సి, 2 శాతం విటమిన్ ఎ, 2 శాతం కాల్షియం, 2 శాతం ఐరన్ ఉంటాయి. ఫైబర్, పొటాషియం ఉంటాయి కాబట్టి గుండె ఆరోగ్యానికి కూడా మంచిదే. ఊబకాయం, చక్కెరవ్యాధి ఉన్నవారు పరిమితంగా తినవచ్చు.

– సాయిచరణ్, వైద్యాధికారి, మర్రిపాడు పీహెచ్‌సీ

1704 లీటర్ల సారా ధ్వంసం



జేకే పాడు సమీపంలో సారా ధ్వంసం చేయిస్తున్న పాలకొండ డీఎస్పీ కృష్ణారావు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట సర్కిల్ నీలకంఠాపురం, కురుపాం, ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసుల దాడుల్లో పట్టుబడిన 1704 లీటర్ల సారాను ఎల్విన్‌పేట పోలీసులు మండలంలోని జేకే పాడు గ్రామ సమీపంలో ఆదివారం ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన పాలకొండ డీఎ స్పీ కృష్ణారావు మాట్లాడుతూ ఎల్విన్‌పేట స్టేషన్ పరిధిలో 239.5 లీటర్ల సారా, కురుపాం స్టేషన్ పరిధిలో 1292.1 లీటర్ల సారా, నీలకంఠాపురం స్టేషన్ పరిధిలో 173 లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు ఈ మూడు స్టేషన్ల పరిధిలో మొత్తం 49 కేసులు నమోదు చేశామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్న సారాను ధ్వంసం చేస్తున్నామన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ కృష్ణారావు హితవు పలికారు. ఈమేరకు ఆదివారం ఆయన ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలజోలికి పోకుండా జాగ్రత్త పడేలా దిశ, జాగృతి పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహన తనిఖీలు ముమ్మరంగా చేపట్టడమే కాకుండా సాయంత్రం, రాత్రి వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్సై ఎస్.షన్ముఖరావు తదితరులున్నారు.

ఆంధ్రా ద్రోహి బీజేపీ–గో బ్యాక్

- సీపీఎం, సీపీఐ నిరసన

విజయనగరం పూల్‌బాగ్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల విద్రోహ పాలన సాగించి ఆంధ్రాకు తీరని ద్రోహం చేసింది. ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విశాఖ రైల్వే జోన్ ఇవ్వకుండా విజయోత్సవ సభ కోసం విశాఖకు కేంద్రమంత్రి అమిత్ షా రావడం సిగ్గు చేటని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రి అమిత్ షా పర్యటనను నిరసిస్తూ ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి అందునా ఉత్తరాంధ్రకు, విశాఖపట్నానికి తీవ్ర ద్రోహం చేసిందని ఆరోపించారు. పోర్టు, రక్షణ రంగం, రైల్వే, విద్యుత్, ఆయిల్ పరిశ్రమలు, బ్యాంకులు, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరిస్తోందని మండిపడ్డారు. ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసే విధంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణకు పూనుకున్న ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, పి.రమణమ్మ, బి రమణ, ఏఐటీయూసీ నాయకులు రంగరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

గర్భస్థ శిశువుల ఆరోగ్య తనిఖీ..!



టిఫా స్కాన్ తీస్తున్న వైద్యుడు

- గర్భిణులకు ఉచితంగా టిఫా స్కాన్
- నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం
- స్కానింగ్ సెంటర్లతో ఒప్పందం

విజయనగరం ఫోర్ట్: మహిళలు గర్భం దాల్చిన సమయంలో గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకోలేకపోవడం వల్ల పుట్టే శిశువులు మానసిక వికలాంగులుగా, అనారోగ్యంతోను పుట్టే ఆస్కారం ఉంది. కొంతమంది పిల్లలు బరువు తక్కువగా పుడుతున్నారు. దీని వల్ల శిశువుల తల్లిదండ్రులు జీవితాంతం వారిని చూస్తూ మనోవేదనతో బతుకుతున్నారు. ఇటువంటి పరిస్థితి భవిష్యత్తులో ఏ గర్భిణికి రాకూడదనే ఉద్దేశంతో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు గర్భంలో ఉన్న శిశువుల ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకుని తగు చికిత్స తీసుకోవడం ద్వారా పుట్టే పిల్లలు ఆరోగ్యవంతంగా పుడతారని భావిస్తోంది.

జన్యుపరమైన లోపాల గుర్తింపు

గర్భంలో పెరుగుతున్న శిశువు ఎటువంటి లోపాలు లేకుండా ఆరోగ్యంగా ఉన్నాడా? లేదా? జన్యుపరమైన లోపాలు ఉన్నాయా అని తెలుసుకునేందుకు ప్రతి గర్భిణికి ఉచితంగా టిఫా స్కాన్ తీయించనుంది. గతంలో మేనరిక వివాహం చేసుకున్న వారికి, భార్యాభర్తల వయస్సులో ఎక్కువ వ్యత్యాసం ఉన్న వారికి, 40 నుంచి 50 ఏళ్ల వయసు మధ్యలో గర్భం దాల్చిన మహిళలకు టిఫా స్కాన్ చేసేవారు. ఆరోగ్యవంతులైన మహిళలకు సైతం అనారోగ్యంగా, దివ్యాంగులైన పిల్లలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అందరు గర్భిణులకు టిఫా స్కాన్ తీసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

గర్భం దాల్చిన 18 వారాలకు స్కానింగ్

గర్భం దాల్చిన 18 వారాలకు గర్భిణులకు టిఫా స్కానింగ్ తీస్తారు. ఇందుకోసం స్కానింగ్ సెంటర్లతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఒప్పందం చేసుకోనున్నారు. జిల్లాలో ఏడాదికి 22 వేల మంది గర్భిణులు ప్రసవిస్తున్నారు. ఒక్కో టిఫా స్కాన్‌కు ప్రభుత్వం రూ.850 చొప్పన చెల్లించనుంది.

ప్రభుత్వ గైనకాలజిస్టు రిఫర్ చేసిన వారికి స్కానింగ్

వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రి పరిధిలో ఉన్న సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాఆస్పత్రులకు చెందిన గైనకాలజిస్టులు గర్భిణులను తనిఖీ చేసి స్కాన్ రాసిన వారికి మాత్రమే టిఫా స్కాన్ తీస్తారు. టిఫా స్కాన్ ద్వారా గర్భంలో ఉన్న శిశువు ఎదుగుదల, అవయవాల పరిస్థితి, ఏ విధంగా ఉందో తెలుస్తుంది.

ప్రభుత్వ ఆదేశాలు వచ్చాయి



గర్భిణులకు టిఫా స్కాన్ తీయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈమేరకు స్కానింగ్ సెంటర్లతో ఒప్పందం కుదుర్చుకుని టిఫా తీయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ